# ఇటలీ శ్రామికవర్గ కమ్యూనిస్టు పార్టీకొరకు-కమ్యూనిస్టు వేదిక
# బూర్జువా జాతీయవాదం పెరుగుదల-విప్లవ శ్రామికవర్గ కర్తవ్యాలు

**అంతర్జాతీయ పరిణామాలు**

బూర్జువా జాతీయవాదం మరోసారి తన విషంతో అంతర్జాతీయ రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేస్తోంది. రెండవ ప్రపంచయుద్ధం తర్వాత మొట్టమొదటిసారిగా బడాసామ్రాజ్యవాద దేశాలు, ఆ దిశగా ఎదుగుతోన్న దేశాలు; ఛాందసవాదుల, ప్రతీఘాతుకశక్తుల నాయకత్వాన నూతనంగా ఉద్భవిస్తున్న చిన్న, పెద్ద పెట్టుబడిదారీ దేశాలు అనేక విధాలుగా దురహంకారాన్ని వ్యాప్తిచేస్తున్నాయి.

అమెరికా ట్రంప్ నుండి రష్యా పుతిన్ వరకు, జపాన్ అబే నుండి టర్కీ ఎర్డోగాన్‌వరకు, చైనా జింగ్‌పింగ్ నుండి ఇండియా మోడీ వరకు, పోలెండు నుండి సిట్జర్లాండు వరకు, ఫ్రాన్సునుండి జర్మనీ వరకు, బెల్జియంనుండి ఆస్ట్రియా వరకు, తూర్పుయూరప్‌లో చాలావరకు, అనేక సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాలలోను ఉన్మాదపూరిత దేశభక్తితో కూడిన బూర్జువా జాతీయవాదము తలెత్తుతోంది.

2008 ఆర్థిక సంక్షోభం, అసమాన అభివృద్ధి, మార్కెట్లకొరకు, ముడిసరుకుల కొరకు, ప్రాంతాలను ప్రభావితం చేయటంకొరకు జరిగిన తీవ్ర ఘర్షణలు ఆధిపత్య దేశాలలో, ఆధిపత్య వ్యక్తులలో దురహంకారం వ్యాప్తి చెందటానికి అనుకూలంగా వున్నాయి. ఆ తీవ్ర పరిణామాల ఫలితమే ప్రస్తుత పరిస్థితి.

సహజంగానే జాతీయవాద, దురభిమాన విధానాల పార్టీలు, ఉద్యమాలు తమ ప్రభావాన్ని అధీన వర్గాలపై జూపి తమ రాజకీయశక్తిని, ఓటు బ్యాంకును పెంచుకుని గ్యారంటీ చేసుకుంటాయి.

ట్రంపు నాయకత్వాన అమెరికా, సామ్రాజ్య వాద దేశంగా తన ప్రాబల్యాన్ని కోల్పోతూ ప్రస్తుత ప్రమాదకర పరిస్థితికి కారణమనేది బహిరంగ సత్యం. 'అమెరికాను మరల ఘనంగా మార్చండి' అనే నినాదం వెనుక అమెరికా సామ్రాజ్యవాదం స్వీయ రాజకీయాల్లోనూ, అంతర్జాతీయంగాను అనుసరిస్తున్న విధానాలలో మార్పును చూస్తున్నాం.

జాతీయవాదాన్ని అత్యంత విద్వేషపూరిత రీతిలో ప్రచారంచేసి డొనాల్డ్ ట్రంప్ ఎన్నికలలో గెలిచి అమెరికా అధ్యక్షుడు అయ్యాడు. రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా అతని తీవ్ర జాతీయవాదం, శ్వేతజాతి దురహంకారం, ఇస్లాంపై ద్వేషభావం ప్రపంచంలో తీవ్ర అభివృద్ధి నిరోధక విధానాలు, దురభిమాన విధానాలు రాజ్యం చేస్తున్నాయని స్పష్టం చేస్తున్నాయి. అమెరికా ప్రత్యేకాధికారాలను పరిరక్షించటం కోసం, ప్రత్యర్థులను బలహీనపరచటంకోసం స్వదేశ ఆర్థిక వనరులను రక్షించటానికి ప్రాధాన్యతనీయటం, జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యతనీయటం ట్రంపు ప్రభుత్వ ప్రత్యేకత.

ట్రంపుయొక్క జాతీయోన్మాదం, విప్లవ ప్రతీఘాతుక రాజకీయాలు ఇతర దేశాల్లో కూడా ఈ విషభావజాలం వ్యాప్తి కావటానికి తోడ్పడ తాయనటంలో ఎటువంటి సందేహం లేదు.

జర్మనీలో ఎ.ఎఫ్.జి అత్యంత మితవాద, జాతీయవాద, నియంతృత్వ పోకడలు కలిగిన పార్టీ; ప్రస్తుతం 3వ పెద్ద పార్లమెంటరీ పార్టీగా వుంది.

ఇటలీలోని ఫాశిస్టు గ్రూపుల్లో జాతీ యోన్మాదం మళ్ళీ భయంకరంగా జడలు విప్పు కుంటోంది. వలసకార్మికులకు వ్యతిరేకంగాను, 'జాతికి జరిగిన అవమానాని'కి వ్యతిరేకంగాను వాటి నాయకత్వం వాదనలు చేస్తున్నది.

సోషల్ సామ్రాజ్యవాదదేశం చైనాలో కూడా దేశ దురభిమానం ఎంత తీవ్రస్థాయికి చేరిందంటే, రివిజనిస్టు చైనా కమ్యూనిస్టుపార్టీకి దానిని నిలువరించటం కష్టసాధ్యంగా మారింది. పిల్లలకు దేశభక్తిని అమితంగా బోధించిన తర్వాత విదేశీ ఆక్రమణదారుల అవమానాలను నిరోధించటానికి, హన్ జాతీయతను సమున్నతంగా నిలపటానికి పాఠశాల కార్యక్రమాల్లో లక్షలాది మంది పిల్లలకు దేశభక్తిని దశాబ్దాలపాటు అమితంగా బోధించిన తర్వాత ఇప్పుడు దురభిమాన స్థాయికి చేరిన ఆ పోకడను నిలువ రించటం చైనా కమ్యూనిస్టు పార్టీకి(రివిజనిస్టు) కష్టసాధ్యంగా మారింది.

వ్లాదిమిర్ పుతిన్ కూడా జాతీయ దురభిమానం కలిగినవాడే. స్లావిక్ సాంప్రదాయం, సనాతన క్రైస్తవం కలగలిసిన రష్యా కొరకు అతను నిలబడుతున్నాడు.

**బూర్జువా జాతీయవాదంయొక్క స్వభావము-లక్ష్యము**

బూర్జువా జాతీయవాదం పాలకవర్గాల దుందుడుకు విధానం. స్వదేశంలోని రాష్ట్రాల మధ్య అంతర్గత సంబంధాలకొరకు, ఇతర దేశాలలోని శ్రామికవర్గాన్ని దోపిడీ చేయటానికి, పెట్టుబడిదారుల మధ్య శతృత్వం, పీడిత దేశాలను లోబరచుకోవటానికి పాలకవర్గాల ఆయుధం బూర్జువా జాతీయవాదం.

పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశాల దేశీయ విధానాల్లోనూ, విదేశీ విధానాల్లోనూ బూర్జువా జాతీయవాద అభివృద్ధియొక్క వ్యక్తీకరణలు, పరిణామాలు వున్నాయి.

ఒకటి, శ్రామికవర్గాన్ని విభజించి వుంచ టానికి, కలుషితం చేయటానికి, పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మూలించటానికై ఐక్యం కాకుండా వుంచటానికి, వినాశకర విద్వేషాలతో ప్రజల, శ్రామికుల సౌభ్రాతృత్వాన్ని దెబ్బతీయటానికి అభివృద్ధి నిరోధక, దోపిడీ వర్గాల చేతిలో ఇదొక సాధనంగా వుంది.

రెండవది, కొద్దిమంది ధనాఢ్యవర్గాలు సమాజాన్ని నియంత్రించే, శ్రామికవర్గాన్ని రాజ్యం అణచిపెడుతూ వుండే పెట్టుబడిదారీ విధానాన్ని, బూర్జువా నియంతృత్వాన్ని రక్షించే బలోపేతం చేసే విధానంగా వుంది.

మూడవది, బూర్జువా జాతీయవాదం అంతర్జాతీయంగా తీవ్ర పరిస్థితులకు దారి తీస్తుంది. సామ్రాజ్యవాదశక్తుల మధ్య, పెట్టుబడి దారీశక్తులమధ్య తీవ్ర ఘర్షణలకు కారణ మౌతుంది. ద్రవ్యపెట్టుబడి సృష్టించిన యుద్ధోన్మాదుల చేతిలో, అభివృద్ధి నిరోధకుల చేతిలో, దురహంకారుల చేతిలో ఇదొక మారణాయుధం. ఇది వారి ప్రయోజనాలను ప్రతిబింబిస్తూ, ప్రజలపై, శ్రామికులపై యుద్ధాన్ని తీవ్రం చేస్తుంది.

ఈ రాజకీయ భావజాలం దేశప్రతిష్ట నుండి బలమైన దేశాల హక్కులదాకా ఏ ముసుగులో దాగున్నప్పటికీ, అది ఎల్లప్పుడు సామ్రాజ్యవాదపు దొంగచాటు యుద్ధాలతో ముడిపడివుంటుంది. ఇది సైనిక వాదానికి, కొత్తకొత్త ఆయుధాలు సమకూర్చుకోవటానికి, నయా వలసవాదానికి, దురాక్రమణలకు, బలమైన దేశాల ఆధిపత్యాన్ని ఆమోదించటానికి దారితీస్తుంది. అందుకే ఇది ఇతర ప్రజల పాలిట మారణాయుధంగాను, అణచివేతకు శక్తి వంతమైన ప్రేరణగాను పనిచేస్తుంది. మరోమారు విభజించే యుద్ధానికి సమాయత్తం చేయటానికి, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాల అభివృద్ధిని నిలువరించటానికి ఎంతగానో తోడ్పడుతుంది.

గతంలోవలెనే నేడు కూడా బూర్జువా దురహంకారం శ్రామికవర్గానికి, పీడిత ప్రజలకు ప్రమాదకరమైనది.

సామ్రాజ్యవాదశక్తుల మధ్య వైరుధ్యాలు తీవ్రమౌతున్న పరిస్థితిలో జాతీయ ప్రయోజనాల కొరకు రక్షణ పేరుతో పాలకవర్గాలు తమ స్వంత ప్రజలమీదే దోపిడీ, అణచివేతలను కొనసాగించే నేరపూరిత విధానాన్ని అమలుపరుస్తూ, ఇతర దేశాల ప్రజలను లూటీ చేస్తూ వారిని బానిసలుగా మార్చుతున్నారు.

సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాల దురహంకారం, జాతీయ వ్యవస్థల చుట్టూ, దోపిడీదారుల స్వీయదేశాల చుట్టూ ప్రజల ఆలోచనలను మలచటం అనేవి ఏ బూర్జువా విధానానికైనా అభివృద్ధిచెందుతున్న ప్రాథమిక కేంద్రాలుగా వుంటాయి.

**ప్రస్తుత బూర్జువా జాతీయవాదపు కొన్ని లక్షణాలు**

బూర్జువా జాతీయ వాదానికి ఒక్కో దేశంలో ఒక్కో ప్రత్యేక పరిస్థితి వున్నప్పటికీ, అది అభివృద్ధి నిరోధకుల స్థితిని, ప్రయోజనాలను, ఆచారాలను, ఇంటా బయటా వున్న శత్రువులను ఎదుర్కొనే ఎత్తుగడలను మొదలగు వాటిని ప్రతిబింబిస్తుంది. ప్రత్యేకించి అభివృద్ధి నిరోధకులు, జనాకర్షక నేతలు, సైనికాధికారులు పాలకులుగా వున్న సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ దేశాలలో బూర్జువా జాతీయవాదానికి సంబంధించిన కొన్ని సాధారణాంశాలను పేర్కొనవచ్చు.

– అంతర్జాతీయ గుత్తసంస్థల మధ్య, సామ్రాజ్యవాద దేశాలమధ్య నిర్దాక్షిణ్యమైన పోటీ నెలకొన్న పరిస్థితుల్లో, ప్రపంచ వాణిజ్యం కష్టభరితమైన పరిస్థితుల్లో స్వదేశీ వస్తువులను రక్షించే పద్ధతి పెరగటం, విదేశీ వస్తువుల వాణిజ్యంపై ఆంక్షలు పెరగటం, ఉత్పాదకతపై నియంత్రణ, జాతీయ పరిశ్రమలకు సహాయం చేయటం, అంతర్గత మార్కెట్లలోకి విదేశీ చొరబాట్ల నిరోధం పెరుగుతాయి.

– మార్కెట్ల ప్రపంచీకరణకు వ్యతిరేకంగా దేశప్రతిష్టను, సార్వభౌమత్వాన్ని పునరుద్ధరింప చేయటం, అధికారాలను నిర్మూలించే లేక పరిమితంచేసే ద్రవ్యపెట్టుబడితో ఏర్పాటైన సంస్థలపైన, వివిధ దేశాల ఆధిపత్య వర్గాలకు వనరులను, భూములను కేటాయించటంపై వ్యతిరేకత కల్పించటం.

– చట్టాలను, ఒప్పందాలను, అంతర్జాతీయ ఒప్పందాలను పట్టించుకోకపోవటమన్న ధోరణి (రాజకీయ, వాణిజ్య, న్యాయసంబంధ మొదలగునవి) వ్యక్తిగత కేసులలో వాటికి పూర్తివిరుద్ధంగా వ్యవహరించే ధోరణి పెరగటం.

– ఇతరుల ప్రవేశాన్ని నిలువరించేందుకు సరిహద్దులకు సాయుధ రక్షణ కల్పించి, సరిహద్దులను మూసివేసి కోటల వంటి రాజ్యాలను సృష్టించటం.

– జాతివివక్షత, ఇతర దేశాలనుండి వచ్చిన కార్మికులను చొరబాటుదార్లుగా, శత్రువులుగా ముద్రవేసి వారిపట్ల అసహనాన్ని ప్రదర్శించటం, విదేశస్తులపట్ల వివక్షతాపూరిత ప్రవర్తన.

– దేశ సరిహద్దుల లోపల ఒకే ఒక్క జాతికి గౌరవం లభించాలన్న భావన, జాతీయ మైనారిటీల, మైనారిటీ జాతుల హక్కులను అణచివేయటం.

– దేశ చరిత్రను సాధారణ ప్రజల కాల్పనిక గాథలనుండి నిర్మించబూనుకోవటం, తారుమారు చేయటం, చరిత్రను వెనక్కు నడపటం, అశాస్త్రీయ, అభివృద్ధి నిరోధక భావాలు(పరిశుద్ధ రక్తం మొదలుగునవి).

– సాంప్రదాయక మతాన్ని రక్షించు కోవటం (క్రైస్తవం, ఇస్లాం, హిందూమతం మొ॥నవి), ఇతర మతాల చొరబాటుకు వ్యతిరేకంగా ఛాందస విలువలను కాపాడటం.

**జాతీయ దురహంకారానికి, నూతన సరళీకృత విధానానికి మధ్యసంబంధము-ఆర్థిక సంక్షోభం**

ప్రస్తుత బూర్జువా జాతీయవాదాన్ని వెనక్కు నడవటమన్నంత తేలికగా తీసుకోకూడదు. ఆ వర్గంయొక్క వ్యవస్థీకృత మూలాలనుండి, ప్రస్తుత సందర్భంలో జరుగుతున్న వర్గ ఉద్యమాలనుండి, పోరాటాలనుండి దానిని అర్థం చేసుకోవాలి.

పెరుగుతున్న జాతీయవాద ప్రభావాన్ని, జాతీయ దురభిమాన ప్రభావాన్ని జాతి గుర్తింపును కనుగొనటం ద్వారా అర్థం చేసుకోలేం (ఆధునిక జాతి వివక్షతకు ఆధారం జీవశాస్త్రం కాదు, సాంస్కృతిక కారణాలు). దశాబ్దాల తరబడి జరిగిన స్వేచ్ఛా వాణిజ్య విధానాల కారణంగా ధ్వంసమైన సమాజం, ఇటీవలి ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభం కలిగించిన వినాశనం, మార్కెట్లకొరకు, ఆధిపత్యం కొరకు నెలకొని వున్న తీవ్రపోటీ, సామ్రాజ్యవాద శక్తులకు, పెట్టుబడిదారీ శక్తులకు మధ్య తీవ్రమౌతున్న

వైరుధ్యాలు, సామ్రాజ్యవాదం సృష్టించిన సామూహిక వలసలు జాతీయవాదం తలెత్తటానికి కారణంగా వుండటమనే దీనికిగల రాజకీయ ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలి.

జాతీయవాద, జాతీయ దురభిమాన భావనలు అనేక దేశాల్లో పెరగటానికి విద్వేషం, అధికారం లేకపోవటం, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఫలితంగా ఏర్పడిన సంస్థలను, వాటి విధానాలను తిరస్కరించాలనే భావన, (సామాజిక కేటాయింపుల్లో కోతలు, కార్మికుల హక్కులపై దాడి, ప్రైవేటీకరణ, బ్యాంకుల ఉద్దీపనలు మొదలుగనవి) పరిస్థితులు మరింత దిగజార తాయేమోనన్న భయం కారణాలుగా వున్నాయి. ఈ భావన ప్రధానంగా పశ్చిమదేశాల్లోని మధ్యతరగతి వర్గాల్లో వ్యాపించివుంది. చారిత్రక కాలంలో ఆ వర్గం కైవసం చేసుకున్న అనేక సదుపాయాలను వారు కోల్పోతూ వున్నారు.

ఈ దృష్టితో ఆధిపత్య వర్గాలలో కొంత మంది ఇప్పటి జాతివిద్వేషంతో కూడిన తీవ్ర జాతీయవాదాన్ని, స్వేచ్ఛా వాణిజ్య విధానపు సంక్షోభానికి పరిష్కారంగా చూస్తున్నారు. ప్రజలలో వున్న అసంతృప్తి, సామాజిక ప్రతిఘటన, దేశభక్తియుత జాతీయ భావాలు, ప్రస్తుత సమస్యలకు బయటశక్తులే (వలసలు, చొరబాట్లు) కారణమన్న భావనలు దురహంకార పూరితంగా, సంకుచితంగా వ్యవహరింప జేస్తున్నాయి.

యూరప్‌లో బూర్జువా జాతీయవాదశక్తులు ప్రజలపై వెచ్చించవలసిన ఖర్చులను తగ్గిస్తూ, పన్నులను పెంచే విధానాలకు, నయాఉదారవాద రాజకీయాలకు, అలాగే పట్టపగ్గాలు లేని సాంప్రదాయక, సోషల్ డెమోక్రటిక్‌శక్తుల కూటమి ఏర్పాటుకు సుగమమైన మార్గాన్ని కనుగొన్నాయి. పెదధోరణులకు గురైన వామపక్ష పెటీబూర్జువాశక్తులు సామాజిక ప్రతిఘటనలకు (స్పెయిన్‌లో 'పోడియాస్', గ్రీస్‌లో 'కోలిజా') దిశానిర్దేశం చేయటానికి చేసిన ప్రయత్నాలతో బలహీనపడిన అనంతరం ఈ జాతీయవాద శక్తులు పుంజుకున్నాయి.

ఈ మితవాద జాతీయవాదశక్తులు తమ ప్రముఖ జాతివిద్వేష ప్రసంగాలతో ప్రపంచీకరణ వ్యతిరేక భావాలను, శ్రామిక ప్రజల కష్టాలను పక్కకు నెట్టేశాయి. బడాపెట్టుబడి మనుగడకోసం సాంప్రదాయక, ఉదారవాద, సంస్కరణవాద పార్టీలను రాజకీయంగా ముందుకు తీసుకు వచ్చాయి. అవి కార్మికుల, నిరుద్యోగుల, యువతీయువకుల, పెన్షనర్ల, స్త్రీల హక్కులను తొలగించాయి. ఫాశిస్టు వ్యతిరేక విధానాలను పూర్తిగా రద్దుచేశాయి. ప్రజలలో తిరోగమన భావాలను, జాతివిద్వేష భావాలను వ్యాప్తి చేశాయి.

తమకు లబ్ధిచేకూరే విధంగా ఈ పార్టీలు ప్రజాఉద్యమాలను యూరోపియన్ యూనియన్‌కు వ్యతిరేకమైనవిగా నిర్వచించాయి. 'టిటిఐపి' ఖర్చులు తగ్గించి పన్నులు పెంచే పద్ధతులు, 'నాటో' యుద్ధ విధానం వీటిని జాతీయమైనవి గాను, స్వదేశీ రక్షణ విధానంగాను అభివర్ణిస్తున్నారు. ఈ విధంగా ప్రపంచీకరణకు వ్యతిరేకమైన, నిజమైన దేశరక్షకులం తామేనని ప్రదర్శించుకునే అవకాశం తిరోగమన, ఫాశిస్టు శక్తులకు కలిగింది.

'తన స్వంత ఇంటిలో తానే యజమాని' వంటి నినాదాలతో తమ ప్రతిష్టను బాగా పెంచుకున్న బూర్జువా జాతీయవాద పార్టీలు వాస్తవానికి స్వేచ్ఛావాణిజ్య విధానాలను వదిలి వేయలేవు. చేజారిన ఆక్రమణలోని కార్మికవర్గం ద్వారా నష్టాలను భర్తీ చేయించలేవు. ఉదార ప్రజాస్వామిక పార్టీల చర్యలు, ప్రజారాశుల జీవితాల్లో కొంచెమైనా సుఖసంతోషాలను కలిగించలేవు. తద్విరుద్ధంగా పెత్తందారీతనాన్ని పెంచటానికి, కార్మిక సంస్థలను నాశనం చేయటానికి, నిరుపేదలపై వలసవచ్చిన వారిపై వివక్షను పెంచిపోషించటానికి సదా సిద్ధంగా వుంటాయి.

ఈ తిరోగమనశక్తులు ప్రపంచీకరణ బాధితులను కాపాడటమన్నది తమ విధానంగా చెప్పుకున్నప్పటికీ, సామ్రాజ్యవాద బూర్జువాలలో కొంతమంది(ప్రత్యేకించి తాము మిలాఖతై వున్న సైనిక, పారిశ్రామిక విభాగాల) రక్షణకే కట్టు బడ్డాయి. పెట్టుబడిదారీ మార్కెట్ పనితీరుపై కేంద్రీకరించటంతో పాటుగా అంతర్జాతీయ పోటీలో గుత్తసంస్థలకు వత్తాసునిచ్చే సాధనంగా రాజ్యాన్ని బలోపేతం చేయటంపైన, పీడిత వర్గాలపై అణచివేత సాధనంగా రాజ్యాన్ని బలోపేతం చేయటంపైన కేంద్రీకరించాయి.

జాతీయవాదంలో స్వేచ్ఛా వాణిజ్య విధానాన్ని (జాతీయ-స్వేచ్ఛ-వాణిజ్య విధానం) చొప్పించే పార్టీలు స్వదేశీ వస్తురక్షణ, వ్యవస్థాగత ఖర్చులలో కోతలు, సంస్థాగతమైన సంకుచితత్వం, యుద్ధ విధానాలను పరివ్యాప్తం చేయటమనే స్పష్టమైన ధోరణులతో వుంటాయి.

**సోషల్ డెమోక్రాట్ల దుర్మార్గపు పాత్ర**

జాతీయవాద భావనలను వ్యాప్తి చేయటంలో, కార్మికుల చైతన్యాన్ని మసక బార్చటంలో సోషల్ డెమోక్రాట్ల నాయకులు ఒక ప్రత్యేకమైన పాత్రనే పోషించారు. అందులో నిష్ణాతులైన వారు శ్రామికవర్గ శ్రేణుల్లో విభజన తీసుకురావటంలో గందరగోళం సృష్టిచటంలో నిమగ్నమైయున్నారు.

అనేక దశాబ్దాలుగా సోషల్ డెమోక్రట్ నాయకులు మన పశ్చిమదేశాల ఉమ్మడి విలువలు', యూరోపియనిజం అనే మాటల చాటున తమ జాతీయవాదాన్ని దాచిపెట్టు కున్నారు. వారు వ్యాప్తిచేసిన భావాలు, చేపట్టిన కార్యక్రమాలు గుత్తపెట్టుబడి అవసరాలను నెరవేర్చటానికి చక్కగా పనికివచ్చాయి. కొన్ని సంవత్సరాలుగా వారు తమ బాణీని మార్చారు. వారి జాతీయవాదం దానంతట అదే బయటకు వచ్చింది. ముఖ్యంగా విదేశీ కార్మికుల విషయంలో క్రమంగా వారు ఫాశిస్టులకు, జాతీయ దురహంకారులకు దారిచేస్తూ, వారే మంత ప్రమాదకరమైనవారు కాదనటం మొదలుపెట్టారు. నేడు సోషల్ డెమోక్రాట్లు జాతీయవాదులతోనూ, మితవాద ఫాశిస్టు శక్తులతోనూ నేరుగా పోటీ పడుతూ, బహిరంగంగానే ఉన్మాదపూరిత దురభిమానాలను వ్యాప్తిచేస్తూ, జాతివిద్వేషాలతో కూడిన చర్చలు చేస్తున్నారు.

సంస్కరణవాద, సోషల్ డెమోక్రాట్ మంత్రులు నిస్వార్థతను, సంఘీభావంవంటి వాటిని కూడా నేరాలుగా మార్చటానికి ప్రయత్నం చేశారు. మధ్యధరా సముద్రంలో వలసకార్మికుల ప్రాణాలను కాపాడటానికి కృషిచేసిన ఎన్జీవోల విషయంలో జరిగిందిదే.

అన్ని దేశాల్లోను సోషల్ డెమొక్రటిక్ పార్టీల నాయకులు దోపిడీ వర్గాల విధానాలకు మద్దతుగా నిలిచారు. వారు అధికారంలోకి వచ్చినప్పుడు వాటిని నేరుగా అమలుచేస్తున్నారు. 'జాతి ఐక్యత' 'బాధ్యతతో మెలగటం' వంటి మాటలతో కార్మికవర్గాన్ని త్యాగాలు చేయమని కోరుతున్నారు.

వలసకార్మికులను సరిహద్దులకు దూరంగా వుంచే విధానాలవలంబించటంలో, వారిని సముద్రంపాలు చెయ్యటంలో, నిర్బంధ శిబిరాల్లోల్లో వారిని చిత్రవధ చేయటంలో ప్రతిదేశంలోనూ వారు మితవాద పార్టీలతో భాగం పంచుకుంటున్నారు.

సామ్రాజ్యవాద దుందుడుకు యుద్ధాలను 'మానవతా చర్యలు' లేకుంటే 'ఉగ్రవాదంపై పోరు' వంటి చక్కెరపూత పదాలతో అభివర్ణిస్తూ వాటి నిజస్వరూపాన్ని మరుగున పడేసే పనిని వారు అన్ని దేశాలలో సాగిస్తున్నారు.

సంస్కరణవాద, సోషల్ డెమొక్రట్ పార్టీల మద్దతు లేకుండా పెట్టుబడిదారులు తమ కార్మిక వ్యతిరేక విధానాలను, తిరోగమన విధానాలను, యుద్ధాలను ప్రేరేపించే విధానాలను అమలు పరచజాలరు. సోషల్ డెమొక్రసీకి ఆధారం బూర్జువా జాతీయవాదమే తప్ప శ్రామికవర్గ అంతర్జాతీయత కాదు. ఈ రాజకీయ ఉద్యమం ఎల్లప్పుడూ జాతీయవాదాన్ని స్వంతం చేసుకుంటూ, శ్రామికవర్గంయొక్క మెదళ్ళలోకి బూర్జువా దేశభక్తి భావోద్వేగాలను ప్రవేశ పెట్టటానికి చూస్తుంది. సామ్రాజ్యవాదం యుద్ధాలను కీర్తిస్తూ ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తుంది. బూర్జువా సైనికుల పోరాట పటిమలను కీర్తిస్తుంది. సామ్రాజ్యవాదుల స్వీయ దేశాలపై అభిమానాన్ని వ్యాప్తిచేస్తుంది. కనుక సోషల్ డెమొక్రాట్లు, బూర్జువా జాతీయవాదులు అనే పదాలమధ్య చెప్పుకోదగినంత బేధమేమీ లేదు.

ఇవి రెండూ కూడా పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా కార్మికులు వర్గపోరాట బాట పట్టకుండా వుండటానికి తీవ్ర కృషిచేస్తాయి. శ్రామిక వర్గాన్ని చీలుస్తాయి. కలుషితం చేస్తాయి. తమ తిరోగమన భావజాలంతో ప్రజల మెదళ్ళను నింపుతాయి. 'ఉమ్మడి జాతీయ ప్రయోజనాలు' అనే అందమైన పదాల చాటున ఇవి రెండూ పీడితుల వర్గ స్పృహను అణగదొక్కటానికి చూస్తాయి. పెట్టుబడిదారుల, కార్మికుల ప్రయోజనాలు ఒక్కటేనని చెప్పటానికి ప్రయత్నం చేస్తాయి.

బూర్జువా జాతీయవాదం పుట్టుక, పాత సోషల్ డెమొక్రసీ సంక్షోభపు పెరుగుదల సమాంతరంగా సాగాయి. (ఫ్రాన్సు, జర్మనీ, ఇటలీ, స్పెయిన్ మొదలగు దేశాల్లోవలె). ఈ సంక్షోభం 1980లలో మొదలై చాలాకాలం కొనసాగింది. పెట్టుబడిదారీ వ్యవస్థ స్వర్ణ యుగపు ముగింపు ఫలితంగాను, ప్రాబల్యంలో నున్న స్వేచ్ఛావాణిజ్య విధానపు ఫలితంగాను ఈ సంక్షోభం ఏర్పడింది. ఆర్థిక ఆధిపత్యానికి విధేయతతో వుండటమన్న విధానంతో సంక్షేమ రాజ్యం బలహీనపడింది. అనేక వరుస ప్రతి సంస్కరణలతో, ప్రజాకార్మిక సంఘాలు బలహీన పడటంతో సోషల్ డెమొక్రసీ తనకు తానుగా స్వేచ్ఛా వాణిజ్యపు విధానంతో సర్దుకుపోయింది.

ఇదంతా అనేక విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు, ప్రజలకు సోషల్ డెమొక్రటిక్ పార్టీలపై విశ్వాసం సడలటానికి దారితీసి, వాటిని తీవ్రంగా విమర్శిస్తూ ఎన్నికల ప్రక్రియలోను, సంస్థాగత నిర్మాణాలలోను వాటిని తిరస్కరించారు. నేడు ప్రజలలో వున్న అసంతృప్తిని ఆసరాగా చేసుకుని ప్రధానస్రవంతి పార్టీలు, మితవాద ఫాశిస్టు పార్టీలు వారిని తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నాయి. వాటి విధానాల్లో దుందుడుకు జాతీయవాదం ప్రధానమైనది. పుంజుకుంటున్న బూర్జువా జాతీయవాదానికి సోషల్ డెమొక్రాట్లు గేట్లు బార్లా తెరిచారన్న కోణంలో వాళ్ళను మనం ఖండించి తీరాలి. ఈ రెండు విషయాలు పరస్పర సంబంధం కలిగినవి.

సోషల్ డెమొక్రాట్లలో తటస్థంగా వుండే వారిలో అధికులు మితవాదంవైపు మొగ్గటం ఊహించిన పరిణామమే. వారు తమ స్వంత జాతీయవాదాన్ని, స్వంత ఫాశిస్టు జాతీయ వాదాన్ని ఏర్పాటు చేసుకుని, శ్రామికవర్గంలోని వెనుకబడిన వర్గాల వారిని మోసంచేస్తూ, అతి తీవ్ర తిరోగామిశక్తులకు సహకరిస్తున్నారు.

**సామ్రాజ్యవాదులతో 'జాతీయ ఐక్యతా రక్షణ'**

మనం ముందే చెప్పుకున్నట్లు పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా పీడిత ప్రజలు పోరాటాలు సాగించకుండా వారిని బలహీనపరిచే లక్ష్యంతోటి సిద్ధాంతాలను, భావజాలాన్ని వారిలో వ్యాపింపచేయటం ద్వారా కార్మికులను విభజించి, వారిని అచేతనులను చేసి పెట్టుబడిదారులపై పోరాటాలకు వారిని దూరంచేయటానికి పాలకవర్గాలు ఎంచుకున్న పద్ధతిలో జాతీయవాదం ఒకటి.

బూర్జువా జాతీయవాదం యొక్క ప్రాథమిక లక్ష్యం అనేక మోసపూరితమైన సాకులతో శ్రామికవర్గాన్ని నిట్టనిలువునా చీల్చివుంచటం, ఉదాహరణకు 'జాతీయ ప్రయోజనాల రక్షణ' 'సంస్కృతీ పరిరక్షణ'–ప్రజల అస్తిత్వం' అనేవి.

'జాతీయ ఐక్యత' 'జాతుల రక్షణ' అనే వాటిని పవిత్రమైనవిగా ప్రకటించుకోవటాన్ని పెట్టుబడిదారీవర్గం ఒక ఎత్తుగడగా స్వీకరిస్తుంది. శత్రువర్గాలకు కూడా ఉమ్మడి ప్రయోజనా లుంటాయని, పెట్టుబడిదారులు సాగించేది ధర్మ యుద్ధమై వుండవచ్చనే భావనను శ్రామిక వర్గంలోకి చొప్పించటం ఈ ప్రకటనల లక్ష్యం.

శ్రామికవర్గ అంతర్జాతీయత అనే జెండాను ఎత్తిపట్టకుండా, స్వతంత్ర, విప్లవ కార్యకలాపాలు చేపట్టకుండా శ్రామికవర్గాన్ని నిలువరించటానికి, వారి శ్రేణులలో చీలిక తేవటానికి వారిలో ఒక గందరగోళాన్ని పెట్టుబడిదారులు కలిగిస్తారు. జాతీయ ఐక్యతకు సంబంధించిన పెట్టుబడి దారులు 'అత్యవసర పరిస్థితి' విధించటానికి అనుకూలంగా వుంటాయి. అందులో కార్మికుల స్వేచ్ఛ హరించబడుతుంది. ఈ అత్యవసర పరిస్థితి అనే పాటతో తామెదుర్కొంటున్న సామ్రాజ్యవాదం చేసే యుద్ధంలో వారు సాయుధ సైనికులుగా ఇతర దేశాలకు, ప్రజలకు, సామ్రాజ్యవాదాలకు వ్యతిరేకంగా పోరాడతారు. ఈ తిరోగమన నినాదాలను ప్రజలందరిచేత ఆమోదింపచేయటానికి పెట్టుబడిదారులు మంచి దేశాలు, చెడ్డదేశాలు అనేవి వుంటాయని, చెడ్డ దేశాల ప్రజలు హింసాత్మకంగాను, దుష్టులు గాను వుంటారని నమ్మించబూనుకుంటారు. పాలకవర్గాలు చాలా అందమైన పదజాలం చాటున ఇతర దేశాలపై,

ప్రజలపై తాము సాగించే యుద్ధాలకు బాధ్యత తమదికాదని, యుద్ధనేరాల గురించి మాట్లాడవలసి వచ్చినప్పుడు సామ్రాజ్యవాదం ఈ సమస్యలకు కారణం కాదని, శ్రామికవర్గానికి శత్రువులు పెట్టుబడిదారులు కాదని, ఇతర దేశాలు, వాటిలోని సాంఘిక సమూహాలే కారణమని చెప్పబూనుకుంటాయి. తాము శాంతిని, స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించటానికే ఈ యుద్ధాలు సాగించవలసి వస్తున్నదని నమ్మ బలుకుతాయి. ఇదే విధంగా ప్రత్యర్థి శిబిరంలోని పాలకవర్గాలు కూడా ఇదే మాటలతో ఇదే ఆచరణతో ప్రజలను వధ్యశాలవైపు నడిపిస్తాయి.

వాస్తవానికి సామ్రాజ్యవాద పెట్టుబడి దారులకు నిజమైన జాతీయ ప్రయోజనాలు అస్సలు పట్టవు. అవి వారికి పూర్తి విరుద్ధంగా వుంటాయి. దేశం కడుపులో దాగివుండే పరాన్న భుక్కులు వాళ్ళు. శ్రామికవర్గ శ్రేణుల్లోనే వున్న వారి ఏజెంట్లు క్యాన్సర్ కణితి వంటివారు.

శ్రామికవర్గ ప్రయోజనాలు, శ్రామికవర్గ అంతర్జాతీయత మాత్రమే పీడిత దేశాల, వారి ప్రజల ప్రయోజనాలకు అనుకూలంగా వుంటాయి.

**కమ్యూనిస్టుల, వర్గచైతన్యం కలిగిన కార్మికుల కర్తవ్యాలు**

ప్రపంచ పెట్టుబడిదారీ విధానం రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అస్థిరత్వానికి లోనైన ప్రస్తుత పరిస్థితిలో, దానిలోని అన్ని వైరుధ్యాలు తీవ్రమౌతున్నవేళ, జాతీయ దురహంకారానికి వ్యతిరేకంగా, ఫాశిజానికి వ్యతిరేకంగా పోరాటాలను తీవ్రతరం చేయటం, శ్రామికవర్గం మధ్య, ప్రజారాశుల మధ్య కార్యాచరణను అధికంచేయటం, వారిలో విప్లవంపట్ల, సోషలిజంపట్ల సంసిద్ధతను నిలబెట్టటం అనేవి తప్పనిసరిగా చేపట్టవలసిన కర్తవ్యాలుగా విప్లవ శ్రామికవర్గం ముందు వున్నాయి.

కా॥లెనిన్ చెప్పినట్లుగా మనం ప్రతిరోజు బూర్జువా జాతీయవాదంపై, దాని అన్ని రూపాలకు వ్యతిరేకంగా పోరాడాలి. యుద్ధంలాగా, హింసాత్మకంగా, దురహంకారపూరితంగా ప్రత్యక్షంగా కనబడే జాతీయవాదానికి వ్యతిరేకంగాను, 'దేశాల సమానత' వంటి పిలుపుల వెనుకదాగిన దాని ముసుగైన రూపానికి వ్యతిరేకంగాను ఆ పోరాటం సాగాలి. వాస్తవానికి జాతీయవాదం జాతీయత ఆధారంగానే శ్రామిక వర్గంలో చీలికను ప్రేరేపిస్తుంది. సంస్కరణ వాదుల, అవకాశవాదుల సాంఘిక దురహంకారాలకు వ్యతిరేకంగా కూడా శ్రామిక వర్గం పోరాడాలి. అంతర్జాతీయ కార్మికవర్గ స్ఫూర్తితో కార్మికవర్గాన్ని, పీడిత తాడిత ప్రజా రాశులను చైతన్యపరచటమే ఈ పోరాటపు ప్రథమ కర్తవ్యం. ఇంకా కార్మికులకు పీడిత ప్రజలకు కార్మికవర్గ అంతర్జాతీయ స్ఫూర్తిని అందించాలి.

ఉమ్మడి శత్రువైన ప్రపంచ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా, దేశంలోని పీడనకు వ్యతిరేకంగా అన్నిదేశాల కార్మికులను ఐక్యం చేసి వర్గపోరాటాలు నిర్మించటం, సంఘీభావ పోరాటాలను నిర్మించటం కమ్యూనిస్టుల ఆచరణాత్మక కర్తవ్యాలు. సామ్రాజ్యవాదంలోని అంతర్గత వైరుధ్యాలు తీవ్రతరమైన ప్రస్తుత తరుణంలో ఈ కర్తవ్యాలు మరింత ప్రాధాన్య మైనవిగా వున్నాయి.

జాతీయవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రస్తుత దశలో ప్రజల వర్గచైతన్యం, భావోద్వేగాలను దృష్టిలో పెట్టుకుని, కార్మికుల నిర్దిష్టమైన, తక్షణ డిమాండ్లను, సైద్ధాంతిక దృక్పథాన్ని జోడించాల్సి వుంటుంది.

అట్టహాస ప్రచారాన్ని మనం వ్యతిరేకించాలి. ప్రతిగా మన ప్రచారం సరళంగా యువ కార్మికులు, నిరుద్యోగులు, పేదలు అర్థంచేసుకునే విధంగా, వారి వాస్తవ ప్రయోజనాలే కేంద్రంగా సాగాలి.

ఒకటి స్పష్టం. బూర్జువా అంధ దేశభక్తికి వ్యతిరేకంగా పోరాడటమంటే ప్రజారాశుల మనోభావాలను, దేశంపట్ల వారికిగల గౌరవ భావాన్ని కించపరచటంకాదు, జాతీయ శూన్య వాదంలో పడిపోవటంకాదు. తద్విరుద్ధంగా, పెట్టుబడిదారులు, ఫాశిస్టులు దేశాన్ని నాశనం చేస్తున్నారని; శ్రామివర్గ అంతర్జాతీయత అంటే, సోషలిస్టు విప్లవం అంటే మన దేశాన్ని, మన సంస్కృతిని రక్షించేవని; నిరాటంకమైన స్వతంత్రమైన అభివృద్ధిని సాధించగలిగేవని మనం వివరించాలి. అలాగే గుడ్డి దేశభక్తికి వ్యతిరేకంగా సాగే పోరాటం, సామ్రాజ్యవాదాన్ని బలహీనపరిచేదని, తుత్తునియలుచేసేదని ఇతర దేశాల జాతీయ విముక్తి పోరాటాలకు సంఘీభావం, మద్దతు తెలపాలనే దానిని గుర్తింపజేయాలి.

దేశభక్తికిగల వర్గ స్వభావం గురించి పెట్టుబడిదారీ కర్కశత్వానికిగల మూలాన్ని, శ్రామికులకు హానికలిగించే దాని పరిణామాల గురించి మన ప్రచారంలో విస్పష్టంగా పేర్కొనాలి. మనం మొట్టమొదటగా వివరించాల్సింది బూర్జువా జాతీయవాదశక్తుల విధానం దేశ ప్రయోజనాలు కాదు, కార్మికుల ప్రయోజనాలు అంతకంటే కాదు. ఈ శక్తులకు మద్దతు పలికే గుత్తసంస్థలకు లాభాలు ఆర్జించి పెట్టటమే. ఇతర దేశాలనుండి వచ్చిన కార్మికుల హక్కులలో, వేతనాలలో వున్న వ్యత్యాసాన్ని సరిచేయాలని మనం డిమాండు చేయాలి. జాతివిద్వేషపూరిత చట్టాలను, విధానాలను రద్దుచేయాలని మనం డిమాండు చేయాలి. నేటి జాతీయవాదానికున్న సాంఘిక, ఆర్థిక పునాదిని పరగణలోకి తీసుకున్నప్పుడు ఇది చాలా ప్రాధాన్యతగలిగిన విషయంగా అర్థమవుతుంది.

మూఢదేశభక్తియొక్క అన్ని రూపాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు విప్లవకర శ్రామికవర్గం నాయకత్వం వహించాలి. పీడిత దేశాలకు అతిపెద్ద పక్షపాతిగా వుండాలి. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకమైన అన్ని వలస దేశాల, అధీన దేశాల పోరాటాలకు నాయకత్వం వహించాలి.

ఇక్కడ ముఖ్యమైనదేమంటే ప్రతి సందర్భంలోనూ కూడా పనిచేయటమే. సాంఘిక దేశభక్తుల, మూఢదేశభక్తుల, బూర్జువా జాతీయ వాదుల ముసుగులను తొలగించి వారిని ఎండగట్టాలి. సామ్రాజ్యవాదులతో తెగదెంపులు చేసుకోకుండా దేశాలు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు సాధించలేవని విరించాలి. ఆధిపత్య దేశాల బూర్జువావర్గాన్ని ఓడించకుండా పీడిత దేశాలు విముక్తి సాధించలేవని తెలియజెప్పాలి.

సామ్రాజ్యవాద దేశాలలో 'పవిత్రదేశం', 'జాతీయ ఐక్యతా ప్రభుత్వాలు', 'జాతీయ అత్యవసర పరిస్థితి', 'జాతీయ రక్షణ'

వంటి విధానాలను తప్పనిసరిగా తీవ్రంగా వ్యతిరేకించాలి. 'సామ్రాజ్యవాదులతో జాతీయ ఐక్యత వద్దు' అనే నినాదాన్ని నిరంతరం నిలబెడుతూ వ్యాప్తిచేయాలి.

దాదాపు అన్ని సామ్రాజ్యవాద దేశాల్లోను, పీడక దేశాల్లోను, యుద్ధాలకు మద్దతు తెలిపే దేశాల్లోను అన్నిరకాల ఆక్రమణలకు, సామ్రాజ్య వాద హింసకు వ్యతిరేకంగా నిర్ణయాత్మకమైన పోరాటం సాగించాలి. ముందుగా తమ స్వంత సామ్రాజ్యవాదపు హింసనుండి – వలసలు స్వాతంత్ర్యం పొందటానికి, పీడిత దేశాలు విముక్తి గావటానికి, దేశాలమధ్య సంపూర్ణ సమానత్వం కొరకు, స్వయం నిర్ణయాధికారం కొరకు, అన్ని పీడిత దేశాల విముక్తి వరకు, సామ్రాజ్యవాదపు మరియు పెట్టుబడిదారీ విధానపు దోపిడి, అణచివేతలకు వ్యతిరేకంగా ఆయా దేశ ప్రజల సార్వభౌమత్వం కొరకు, స్వేచ్ఛ స్వాతంత్ర్యాల కొరకు పోరాటాలు సాగించాలి.

ప్రజల స్వయం నిర్ణయాధికారంకోసం సాగే పోరాటాలకు సహాయమందిచటం అనేది ఒక నిరంతర అంతర్జాతీయ పనివిధానం. శ్రామికవర్గపు విప్లవ విధానం మాత్రమే ప్రజల స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమత్వాన్ని పరిరక్షిస్తుంది. ఎక్కువ సందర్భాలలో ఇవి విప్లవంతోనూ, సోషలిజంతోనూ ముడిపడి వుంటాయి. అందుకే మనం పీడక దేశాల్లో శ్రామికవర్గ సాధారణ పోరాటాలకు పిలుపు నివ్వాలి. పీడిత దేశాల్లోను, వలసదేశాల్లోనూ శ్రామికవర్గ విప్లవోద్యమాలకు పిలుపునివ్వాలి.

సామ్రాజ్యవాద యుద్ధానికి వ్యతిరేకంగా శాంతికొరకు చేసే పోరాటానికి సంబంధించి మనం కేంద్రీకరించవలసినవి – ఆ ప్రత్యేక సందర్భంలో యుద్ధానికి ముఖ్యకారణమైన సామ్రాజ్యవాదికి వ్యతిరేకమైన కార్యాచరణ; యుద్ధానికి వ్యతిరేకంగా చేసే పోరాటానికి తిరోగమన, ఫాశిస్టుశక్తులకు వ్యతిరేకంగా చేసే పోరాటాన్ని జతచేయటం; సామ్రాజ్యవాద దేశాల మధ్య మారణాయుధ నిల్వలు పెంచుకోవటంలో పోటీకి వ్యతిరేకంగా, పోలీసు రాజ్యాల స్థాపనకు వ్యతిరేకంగా పోరాటాలను బలోపేతంచేయటం, యుద్ధాలకు మద్దతు తెలిపే కూటముల నుండి బయటకు రావటంకొరకు, విదేశాలకు పంపిన సైన్యాలను ఉపసంహరించటానికి, సామ్రాజ్య వాదపు అణచివేతకు గురైన దేశాల ప్రజల విముక్తి పోరాటాలకు మద్దతునిచ్చే కార్యాచరణను కలిగి వుండాలి.

ప్రజలను జాతివిద్వేషక భావజాలంనుండి బయటపడవేయటానికి, మరోకొత్త ప్రపంచ యుద్ధ సన్నాహకాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించటానికి, ఆధిపత్యభావజాల వ్యతిరేక పోరాటంపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలి.

ప్రజల చరిత్రకు సంబంధించిన సైద్ధాంతిక కల్పనలపై, వక్రీకరణలపై పోరాడే బాధ్యత మనదే. గత చరిత్రకు సంబంధించిన జ్ఞానాన్ని కార్మికవర్గానికి అందించటం, వాటిని ప్రస్తుత పోరాటాలతో జోడించి విప్లవ సాంప్రదాయాన్ని కొనసాగించే బాధ్యత కూడా మనదే.

సోషల్ డెమొక్రాట్ల, ట్రేడ్‌యూనియన్ బ్యురోక్రాట్ల పటాటోపాన్ని, వాగాడంబరాన్ని మనం నిర్దాక్షిణ్యంగా ఖండించాలి, ఎండగట్టాలి. వర్గాల మధ్య సహకారం, జాతీయ ప్రయోజనాల పేరిట త్యాగాలు చేయాలనే విధానం, సాంఘిక దేశభక్తి, సాంఘిక సామ్రాజ్యవాదం, ఫాశిస్టు పదబంధాలతో సామ్రాజ్యవాదులకు, యుద్ధ పిపాసులకు ముసుగులు వేయటంవంటి వాటినన్నీ ఖండించి ఎండగట్టాల్సిన కర్తవ్యం మనదే.

మనం ఈ పోరాటాన్ని కార్మికోద్యమంలో వున్న ప్రత్యేకశక్తితోను, ప్రగతిశీలమైన పార్టీల, కమ్యూనిస్టు పార్టీలలోని శ్రేణుల శక్తితోను నిర్వహించాలి. ప్రధానంగా సామ్రాజ్యవాద దేశాలలో పనిచేసే పార్టీల ద్వారా ఇది సాగాలి. ఎందుకంటే అక్కడే సామ్రాజ్యవాద బూర్జువాల భావజాలం, అభిప్రాయాలు, సంస్కరణవాదం వివిధ రకాలుగా ప్రతిబింబించబడతాయి. ఫాశిజం, దేశదురభిమానం పెరుగుతున్న కారణంగా శ్రామికవర్గ ఐక్యకూటమి విధానాన్ని అభివృద్ధి చేయటం, దాని ఆధారంగా ఒక ప్రజామోద కూటమిని ఏర్పాటుచేయటం అనేవి కమ్యూనిస్టులందరూ, విప్లవకారులందరూ తప్పనిసరిగా చేపట్టవలసిన కర్తవ్యాలుగా వున్నాయి.

సామ్రాజ్యవాద వ్యతిరేక ఫాశిస్టు వ్యతిరేక ప్రజాకూటమిని ఏర్పాటు చేయటానికి మనం శక్తివంచన లేకుండా కృషిచెయ్యాలి. విప్లవ శ్రామికవర్గం నాయకత్వాన ఆ కూటమిలో చిన్నరైతులు, పట్టణపేదలు, పీడిత దేశాల ప్రజలు, నిజాయితీ గలిగిన ప్రగతిశీల ప్రజాస్వామికశక్తులు, ఒక నిర్దిష్ట కార్యక్రమాన్ని, డిమాండ్లను రూపొందించుకుని వాటి సాధనకు కృషిచెయ్యాలి. ఆ డిమాండ్లు శ్రామికవర్గంయొక్క ప్రాథమిక ప్రయోజనాలకు అనుకూలమైనవిగా వుండాలి.

ఈవిధమైన కూటములను ఏర్పాటు చేయటానికి కారణం, కార్మికవర్గం తన స్వంత ప్రయోజనాలను సాధించటానికి, దానికి వత్తాసుగా ఇతర పీడిత ప్రజల ప్రయోజనాలను జతచేయటం నిర్ణయాత్మకమైన చర్య.

చాలా స్పష్టంగా ప్రతిదేశంలోనూ ప్రాథమిక డిమాండ్లకు సంబంధించి కొన్ని ప్రశ్నలు వుంటాయి. ఆ డిమాండ్లు కార్మికులలో అధికుల మద్దతు సంపాదించినవి. ఈ డిమాండ్ల చుట్టూనే ప్రజాకూటములు పరిభ్రమించేలా చేయాలి.

***(జనవరి 2018 రివల్యూషనరీ డెమొక్రసీ సౌజన్యంతో)***

ooo